క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: అక్షయ తృతీయ సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రం కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, సన్నిధిరాజు వెంకన్నల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేయగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాజగోపాల శర్మ, శ్రీకాకుళం సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపర్ణాదేవికి..


ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవికి బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసినట్టు ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించగా పలువురు మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా నందీశ్వరుని ఉత్సవాలు


నందీశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం ఎదురుగా కొలువై ఉన్న నందీశ్వరుని సంబరాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం మండపారాధన, నందీశ్వరుడికి అభిషేకం అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని గోపాలకృష్ణ ఆలయ సేవాసమితి బృందం, నందీశ్వర ఉత్సవ సేవా సమితి సభ్యులు తెలిపారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. భక్తులు నందీశ్వరుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామలింగేశ్వరునికి గంధోత్సవం


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామలింగేశ్వర ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా పార్వతీ, పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు పరమేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం, అమ్మవారికి లలిత సహస్రనామాలతో కుంకుమార్చన చేశారు. చందనోత్సవం సందర్భంగా ఆలయ సేవా సభ్యుల సహకారంతో స్వామివారిని గంధంతో, విష్ణు నామాలతో ఉదక కుంభాలతో అలంకరించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. అక్షయ తృతీయ రోజున స్వామివారికి భక్తులు ఏం సమర్పించినా అక్షయమైన ఫలితాలిస్తుదని అర్చకులు వివరించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలంకారప్రాయంగా హ్యాండ్‌వాష్ యూనిట్



పెద్దాపురం: సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఉన్న హ్యాండ్ వాష్ యూనిట్ అలంకారప్రాయంగా మిగిలింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజలు హ్యాండ్ వాష్ నిమిత్తం స్వచ్ఛ సంకల్పంలో భాగంగా సుమారు రూ.లక్షతో ఈ యూనిట్ ఏర్పాటు చేశారు. కాని అది ప్రస్తుతం నిరూపయోగంగా. దీనిని పునర్వినియోగానికి తీసుకురావాలని కోరుతున్నారు.

భూసార పరీక్షలతో సాగు బాగు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- రసాయనిక ఎరువుల వినియోగానికి దూరం
- చేతికి ఆరోగ్యకరమైన పంటలు


పెద్దాపురంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

పెద్దాపురం: పూర్వం వేసవిలో భూమిని దుక్కి చేసేవారు. పెంటగెత్తం, చెరువు మట్టిని వేసి సారవంతం చేసేవారు. వర్షాలు అనుకూలించిన వెంటనే సాగుకు సమాయత్తమయ్యేవారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేవి. ఆరోగ్యకరమైన పంటలు చేతికి అందేవి. కాలం మారింది. రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. భూమి నిస్సారమై, పంటలు కలిసి రావడం లేదు. ఏ పంట సాగు చేసినా పెట్టుబడే మిగులుతోంది. అందుకే భూసార పరీక్షలకు ప్రాధాన్యం పెరిగింది. మట్టి పరీక్షలు నిర్వహించి పోషక లోపాలు నివారించాలని, పశువుల పెంట, పచ్చిరొట్ట ఎరువులతో భూమిని సారవంతం చేయాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ప్రాధాన్యం వివరిస్తున్నారు. భూసార పరీక్షల నివేదిక ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయని చెబుతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ..

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట మండలంలో 22,250 ఎకరాలు, పెద్దాపురం మండలంలో 9892 ఎకరాలు, వెరసి 32,142 ఎకరాల్లో సాగు జరుగుతుంది. ఎరువులు ఎక్కువ మోతాదులో పంట పొలాల్లో వినియోగించడంతో భూమిలో పోషక విలువలు తగ్గి నిస్సారంగా మారింది. కాంప్లెక్స్ ఎరువుల వినియోగంతో భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాల్లో వ్యత్యాసాలు ఏర్పడి దిగుబడులు తగ్గడంతో పాటు చీడపీడలు అధికమతున్నాయి. నియోజకవర్గంలో ఎక్కువ శాతం జింకు లోపంతో ఉన్న నేలలే అధికంగా ఉన్నట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి.

భూసార పరీక్షలు ఇలా

సాధారణ పొలంలో అయితే ఆరు అంగుళాల లోతు, చెరకు, అరటి లాంటి పొలాల్లో అయితే ఎనిమిది అంగుళాల లోతులో 'వి' ఆకారంలో పారతో కట్ చేసి, మట్టి నమూనా సేకరించాలి. ఇలా ప్రతి ఐదెకరాల్లో ఒక మట్టి నమూనాను సేకరిస్తారు. మట్టి నమూనాతో పాటు రైతు పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, ముందు వేసిన పంట, వేయబోయే పంట, వినియోగించిన ఎరువుల వివరాలను పొందుపరుస్తారు. వీటిని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ (భూసార పరీక్షా కేంద్రానికి)కు తరలించి, పరీక్షలు నిర్వహిస్తారు. భూసార పరీక్ష అనంతరం సేంద్రియ కర్బనం, ఎలక్ట్రికల్ కండక్టవిటీ (ఈసీ), ఉదజని సూచిక (పీహెచ్), నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ మూలకాలు తదితర ధాతు లోపాలు కార్డుపై నమోదు చేసి రైతుకు అందిస్తారు. దీంతో లోపాలు సవరించేందుకు కార్డులో ఇచ్చిన ధాతువులు పొలంలో వేసుకుంటే భూమిలో సిరులు పండుతాయి. ఈ పరీక్షలు ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

భూసార పరీక్షల వల్ల లాభాలు

- ఎరువుల వినియోగం తగ్గడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు.
- రైతు భూమిలో ఎటువంటి లోపాలు ఉన్నాయో తెలుస్తాయి.
- తెగుళ్లు, పురుగులు నివారణ అవుతాయి.
- వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి.

పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి



పూర్వం రైతులు ఎరువులకు బదులు పెంటగెత్తాలు, పచ్చిరొట్ట ఎరువులైన పిల్లి పెసర, కట్టే జనుము తదితరాలు వినియోగించేవారు. భూసారం పెరిగి మంచి పంటలు పండేవి. ప్రజలు ఆరోగ్యంగా జీవించేవారు. నేడు రసాయనిక ఎరువుల వాడకంతో ఖర్చు పెరిగి వ్యవసాయం భారంగా మారింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ, పిల్లి పెసర 75 శాతం రాయితీపై వ్యవసాయశాఖ అందిజేస్తోంది. రైతులు వినియోగించుకుని భూసారం పెంచుకోవాలి.

– కె.సంజయ్‌కుమార్, ఏఓ, పెద్దాపురం మండలం

ఆత్మీయ సమావేశం



కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో నాగులపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు, సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణ రెడ్డి కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల వల్ల మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ డివిజన్ ఈఈ ఏపీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, రవీంద్రపురం, కొత్త సూరాడపేట, కొత్త మాయపట్నం, సుబ్బంపేట, రంగంపేట, ఉప్పాడ, అమీనాబాద్, పల్లిపేట, పాత మాయపట్నం తోపాటు యండపల్లి, అమరవిల్లి, పొన్నాడ, నాగులపల్లిలో ఉన్న రొయ్యిల చెరువులకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారుల సహకరించాలన్నారు.

మున్సిపాలిటీ కాదు.. మురుగుగెడ్డ!

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ధ్వజం
- వాడీవేడిగా పిఠాపురం కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మురుగు కాలువల ఫొటోలు చూపి నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పట్టణం మురుగు గెడ్డగా మారిందని, ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఇన్‌చార్జి చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. తొలుత ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్ రాయుడు శ్రీనివాస్ పట్టణంలో క్షీణించిన పారిశుధ్యానికి సంబంధించి ఫొటోలను చూపిస్తూ ఆరు నెలలుగా ఇదే పరిస్థితి, మీరు బాగుచేస్తారన్న నమ్మకం లేదు, మేమే చీపుర్లు చేతపట్టి పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని మండిపడ్డారు. కౌన్సిలర్ బోను దేవ మాట్లాడుతూ మున్సిపాలిటీలో గతంలో ఉన్న సిబ్బందే ఉన్నపుడు ఏడాదిగా ఎందుకు ఎదురవుతోందని, ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కదా అని దుయ్యబట్టారు. కౌన్సిలర్ ముమ్మిడి వెంకట లక్ష్మి రత్న సుజిత మాట్లాడుతూ గత ఆరు నెలలుగా తమ వార్డు పరిధి కొండప్పవీధిలో ఆరు నెలలుగా పొంగి పొర్లుతున్న డ్రైన్లపై పాడా కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని పేర్కొన్నారు. అలాగే డ్రైన్లకు అవుట్‌లెట్లను కబ్జాదారులు మూసేస్తున్నా పట్టించుకోవడం లేదని కమిషనర్ కనకారావును నిలదీశారు. దీనిపై కమిషనర్ బదులిస్తూ గురువారం తాను స్వయంగా వచ్చి సమస్య పరిష్కరిస్తానని పేర్కొన్నారు. పారిశుధ్య సిబ్బంది వారి బదులు వేరొకరిని పనులకు పంపుతున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. కౌన్సిలర్ పెదపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాడా కార్యాలయం నిర్వహణకు మున్సిపల్ వసతిగృహాన్ని రూ.17 వేలకు మాత్రమే అద్దెకు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. అనంతరం కమిషనర్ శానిటరీ అధికారిని పిలిచి ఇక నుంచి తడి, పొడి చెత్తను ఇళ్లకు వెళ్లి సేకరించి తూకం వేసి ఆవివరాలు కౌన్సిలర్లకు తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు శూన్యం


గొల్లప్రోలు సమావేశంలో వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ అలేఖ్యారాణి

పిఠాపురం: అనధికార లే అవుట్లను అధికారులు పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం బుధవారం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. నగర పంచాయతీ అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కేటాయించిన నిధుల వివరాలు ఇవ్వాలని వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి కమిషనర్ కనకారావుకు వినతిపత్రం అందజేశారు. పనులు ఎక్కడెక్కడ నిర్వహించారు, ఎంత ఖర్చు పెట్టారనే పూర్తి వివరాలు ఇవ్వాలని ఆమె కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ కనకారావు త్వరలోనే వివరాలు అందజేస్తామని తెలిపారు. చిన్నచిన్న డ్రైన్లలో పూడిక తీయడానికి పనిముట్లు లేవని, అన్ని పెద్దవి ఉండడంతో చిన్న డ్రైన్లలో పూడిక తీయడం సాధ్యం కావడం లేదని సిబ్బంది చెబుతున్నారని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

- డీసీపీయూ కౌన్సిలర్ దుర్గారాణి


బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

పిఠాపురం: బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీసీపీయూ కౌన్సిలర్ బి.దుర్గారాణి హెచ్చరించారు. స్థానిక పాదగయ క్షేత్రంలో బుధవారం నిర్వహించిన బాల్య వివాహ వ్యతిరేక అవగాహనలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ ఆదేశాల మేరకు అక్షయ తృతీయను పురస్కరించుకుని సీడీపీఓ సీహెచ్ ఎస్‌కే దుర్గాదేవి ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల పూర్తి కాకుండా వివాహం చేస్తే దాన్ని బాల్య వివాహంగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్యవివాహాల సమాచారం ఎవరికైనా తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 181, 100కు కాల్ చేసి తెలపాలని ఆమె విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీఓ చిన్నారావు, ఆలయ ఈవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల సారథులు వీరే

సామర్లకోట: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించింది. నియోజకవర్గంలో వివిధ విభాగాలకు 26 మందిని నియమిస్తూ బుధవారం పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీచేసింది. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టారు. యూత్ వింగ్‌కు వీరమరెడ్డి వెంకయ్య (నాని), మహిళా విభాగానికి సేపేని రూప, రైతు విభాగం నుంచి పెట్టా విజయ్‌కుమార్‌లను నియమించారు. బీసీ సెల్ విభాగానికి పప్పుల వీర వెంకట సత్యనారాయణ, ఎస్సీ సెల్ నుంచి బంగారు కృష్ణ, ఎస్టీ సెల్‌కు మర్రి శేషారావు, మైనార్టీ సెల్ నుంచి షేక్ రఫీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు జంగమ్ జయరాజు, స్టూడెంట్ వింగ్‌కు వాడపల్లి సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ వింగ్‌కు నాగనబోయిన రాజబాబు నియమితులయ్యారు. మున్సిపల్ వింగ్‌కు ఇరుసుమళ్ల సాయి సత్యనారాయణ, ఆర్‌టీఐ వింగ్‌కు కదారి దీపక్, వలంటీర్ వింగ్‌కు ఎద్ది సూర్య వీరా స్వామి, గ్రీవెన్స్‌సెల్‌కు మండపాక సురేష్, వాణిజ్య విభాగానికి శంకా వీర వెంకట కామేశ్వర గుప్త, వీవర్స్ వింగ్‌కు తూతిక సత్యనారాయణ, వైఎస్ఆర్‌టీయూసీ విభాగానికి గుర్రాల యాకోబును నియమించారు. అంగన్‌వాడీ వింగ్‌కు డి.భారతి, లీగల్ సెల్‌కు పి.బాలకృష్ణ, కల్చరల్ వింగ్‌కు ఎం.శివశంకర ప్రసాద్, సోషల్ మీడియా వింగ్‌కు వరసుధాకర్, ఐటి వింగ్‌కు సింగన్న శివ, డాక్టర్స్ వింగ్‌కు జోగా వీరభద్రరావు, ఇంటలెక్చువల్స్ ఫోరమ్‌కు పెండ్యాల అబ్బులు, బూత్ కమిటీ వింగ్‌కు జి.రమణ, పబ్లిసిటీ వింగ్‌కు జల్ల మోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- మిల్లర్లకు జేసీ రాహుల్ మీనా ఆదేశం
- నియోజకవర్గంలో నిల్వల పరిశీలన


సామర్లకోటలో రైతు సమస్యలను జేసీకి వివరిస్తున్న కంటే బాబు

పెద్దాపురం: రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లర్లు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామని, రైతులు అధైర్యపడవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు గ్రామాల్లో బుధవారం ఆయన ధాన్యం కళ్లాలను పరిశీలించి, రైతులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మీనా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సీఎంఆర్ పథకంలో మిల్లర్లు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏడీఏ దైవకుమార్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏఓ సంజయ్‌కుమార్, పౌర సరఫరాల డీఎం నాయక్, రైతులు ఉన్నారు.

ధాన్యం నిల్వల పరిశీలన

సామర్లకోట: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ధాన్యం స్టాక్ పాయింట్‌ను బుధవారం సాయంత్రం జేసీ రాహుల్ మీనా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకండా చూడాలన్నారు. ఆయన వెంట ఏడీఏ రత్నప్రశాంతి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ సత్య, డీఎం నాయక్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

నియోజకవర్గ పరిధిలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు జాయింట్ కలెక్టర్‌ను కోరారు.. నియోజకవర్గంలో రెండు అతిపెద్ద రైస్ మిల్లులు ఉన్నప్పటికీ సీఎంఆర్ ధాన్యం కొనడం లేదని ఆరోపించారు. వారు ధాన్యాన్ని కొన్నట్టు అయితే సమస్య ఉండదన్నారు. సీఎంఆర్ కాకుండా నగదు పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులకు నగదు సర్దుబాటు కావడానికి నెల రోజులు పడుతుందన్నారు. సీఎంఆర్‌లో ధాన్యం కొనుగోలు చేస్తే 48 గంటల్లోనే ధాన్యం సొమ్ము పడుతుందన్నారు. దీనిపై జేసీ స్పందిస్తూ రైస్ మిల్లర్లతో చర్చించి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


గ్రంథాలయంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పెద్దాపురం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఇటువంటి శిబిరాలకు విద్యార్థులను ప్రోత్సాహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ విటమిన్ల ప్రాధాన్యాన్ని వివరించారు.

సాహితీ తేజం శ్రీశ్రీ

కాకినాడ రూరల్: ఆంధ్ర సాహితీ లోకాన్ని ఉత్తేజపరిచిన అభ్యుదయ కవి, నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ అని సాహితీవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రవి శంకర్ పట్నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చందనోత్సవ పూజ

బోట్‌క్లబ్: అక్షయ తదియ సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో ఉన్న రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో చందనోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. మధ్వ పురోహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. గత మూడు దశాబ్దాలుగా చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మతీర్థ స్వామీజీ ఆశీస్సులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


నడకుదురు పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు

కరప: మండలం నడకుదురులోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ బుధవారం తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిబిరానికి పంపించి సహకరించాలన్నారు. ఈ పాఠశాలను మోడల్ స్కూల్‌గా చేశారని, ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఇక్కడ ఉంటాయని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు ఎంఈఓలు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచనల మేరకు వేసవి తరగతులను ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల పదో తేదీ వరకు, తిరిగి జూన్ నెల ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకు వేసవి తరగతులు ఉంటాయన్నారు. తనతో పాటు ఉపాధ్యాయిని కె.విజయలక్ష్మి పిల్లలకు 9 రకాల యాక్టివిటీస్ నేర్పించి, వారిచే చేయించి ఉత్సాహం కల్పిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన టీచర్లు, రిసోర్స్ పర్సన్లు ప్రత్యేకంగా పప్పెట్ షోలు, గణితంలో మెళకువలు, మట్టితో బొమ్మల తయారీ, కర్సివ్ రైటింగ్, చిత్రలేఖనం, చెస్, సంగీతం వంటివి నేర్పిస్తామన్నారు. ఐదేళ్ల నుంచి పదేళ్ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కోరారు.

● వృక్ష విలాపం..


ఉప్పాడలో తలలు తెగిపడిన వృక్షాలు

(అంతర చిత్రం) వాకతిప్పలో పరిస్థితి ఇదీ..



కొత్తపల్లి: అటవీ, విద్యుత్ శాఖల సమన్వయ లోపంతో విలువైన వృక్ష సంపద నేలకొరుగుతోంది. కష్టపడి పెంచిన మొక్కలపై అటవీశాఖకు ప్రేమ లేకపోవడం ఒక బాధైతే, తమ తీగలకు అడ్డొస్తున్నాయని విద్యుత్ శాఖ ఇష్టం వచ్చినట్టు మోడు మొదలంటా నరికేస్తుండడం మరొక వ్యధ. మండలంలో ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో మొక్కలు ఏపుగా పెరిగి రహదారికి ఇరువైపులా సుందరంగా దర్శనమిస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు తమ విద్యుత్ తీగలకు తగులుతున్నాయని చెట్ల కొమ్మలను కోడిమెడ విరిచినట్టు, మేక తల నరికినట్టు ఇష్టానుసారం ధ్వసం చేశారు. మొక్కలు నాటినప్పుడు నోరు మెదపని విద్యుత్ అధికారులు నేడు విద్యుత్ లైన్లు కోసం చెట్ల తలలు తెగనరుకుతున్నారు. ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి ఏటా లక్షలాది మొక్కలు నాటుతుంటే అవి నాటడం వెనుక ఉన్న లక్ష్యాన్ని విస్మరించి ఇష్టారీతిన నరకడం బాధాకరమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు మంచిని మాత్రమే నేర్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్వామి రామానంద

ప్రత్తిపాడు రూరల్: పిల్లలకు మంచిని మాత్రమే నేర్పించాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ప్రచార ప్రముఖ్ నండూరి కృష్ణ సూచించారు. ప్రత్తిపాడులోని ముదునూరి మరళీ రాజు గెస్ట్ హౌస్ ప్రాంగణంలో బుధవారం బాల వికాస కేంద్రాల ప్రముఖ్ గుండు విశ్వనాథం మాస్టార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు దేవాలయాలు నిర్మించామన్నారు. ఈ ఆలయాల వద్ద నిర్వహిస్తున్న బాల వికాస కేంద్రాల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నియమ నిబంధనలతో చిన్నప్పటి నుంచి సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ఆంధ్రా అరుణాచలం వ్యవస్థాపకులు స్వామిరామానంద తెలిపారు. బాల వికాస కేంద్రాల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సింగలి దేవి సత్తిరాజు, ఆర్‌ఎస్ఎస్ విభాగ కుటుంబ ప్రబోదక్ పెమ్మరాజు రామచంద్రరావు, గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, బి.పేరాజు, పడాల రాంబాబు, తంగేళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.